# గండి 'పేట'..!

- రెండోరోజూ వర్షాలు, వరదలు
- కాలువలకు, పొలం గట్లకు గండ్లు
- పొలాల్లో ఇసుక మేటలు





అశ్వారావుపేట రూరల్:పెదవాగు ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే , అశ్వారావుపేట రూరల్: పొలాల్లోకి కొట్టుకు వచ్చిన రాళ్లు, అశ్వారావుపేట రూరల్: కొత్తూరులో ప్రజలు



దమ్మపేట: దెబ్బతిన్న అంతర్గత రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట టౌన్, జూలై 19: అశ్వారావుపేట నియోజకవర్గవ్యాప్తంగా రెండో రోజు శుక్రవారం కూడా వర్షం, వరదలు ఆగలేదు. మొదటి రోజు గురువారం పెదవాగు ప్రాజెక్టుకు గండి పడింది. రెండోరోజు శుక్రవారం వెంకమ్మ చెరువు పంట కాలువలకు గండ్లు పడ్డాయి. ఈ నీరంతా ముంచెత్తడంతో పంట పొలాల గట్లకు గండ్లు పడ్డాయి. చెరువులు ఉవ్వెత్తున పొంగిపొర్లుతున్నాయి. వరదలతో పొలాలు నీట మునిగాయి. వాటిలో ఇసుక మేట వేసింది. వెంకమ్మ చెరువు అలుగు ఉధృతంగా పారడంతో వాగొడ్డుగూడెం వాగు.. రోడ్డు మీద నుంచి మూడు అడుగుల ఎత్తున ప్రవహిస్తున్నది. ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చంద్రుగొండ మండలం తిప్పనపల్లిలోని ఎదుళ్లవాగు, చంద్రుగొండలోని లంకలవాగు, రావికంపాడు వాగు, బాలియతండా వాగు పొంగిపొర్లుతున్నాయి. అన్నపురెడ్డిపల్లి మండలంలోని కట్టుగూడెం వాగు నీటి ప్రవాహంతో రోడ్డు మునిగింది. మరో రెండు రోజులపాటు వర్షాలు ఇలాగే కురుస్తాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



అశ్వారావుపేట టౌన్: పంట కాలువకు గండి



అశ్వారావుపేట టౌన్: చేపలు పడుతున్న ప్రజలు






అశ్వారావుపేట టౌన్: వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు, అశ్వారావుపేట రూరల్: బురదమయమైన సామగ్రి, ఇల్లు శుభ్రం చేసుకుంటున్న మహిళ, దెబ్బతిన పూరిల్లు






అన్నపురెడ్డిపల్లి: నిండిన నర్సపాలెం చెరువు, అశ్వారావుపేట టౌన్: పొంగిన వాగొడ్డుగూడెం వాగు, అశ్వారావుపేట టౌన్: వరదను పరిశీలిస్తున్న డీఎస్పీవో, అశ్వారావుపేట రూరల్: నీరులేక వెలవెలబోతున్న ప్రాజెక్టు






చంద్రుగొండ: పొలాల్లో చేరిన వర్షపు నీరు, అన్నపురెడ్డిపల్లి: వరి పొలంలోకి చేరిన వరద నీరు, అశ్వారావుపేట టౌన్: పంట పొలాల్లోకి వస్తున్న వరద, పొల్లాలో ఇసుక మేటలు

## రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

భద్రాచలం, జూలై 19: భద్రాద్రి దివ్యక్షేత్రంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ. 5కోట్లతో తయారు చేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచాలను అర్చకులు ధరింపజేశారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తును ప్రాకార మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న 11మంది కల్యాణ దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే సమ్మె

భద్రాచలం, జూలై 19: ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించకపోతే ఈనెల 21 నుంచి మరోసారి సమ్మెకు దిగుతామని సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నర్సారెడ్డి మాట్లాడారు. ఈ నెల 19లోపు వేతనాలు వేస్తారని హామీ ఇచ్చారని వేతనాలు ఇవ్వకపోతే ఆదివారం నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఏరియా ఆస్పత్రి బాధ్యులు రమాదేవి, కృష్ణ, నర్సింహారావు, గీత, మమత, రమణమ్మ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జూలూరుపాడు, జూలై 19 : మండలంలోని జూలూరుపాడు, పాపకొల్లు, పడమట నర్సాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖాధికారి సతీష్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.

## రేపు దమ్మపేటలో జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

కొత్తగూడెం టౌన్, జూలై 19 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఉదయం 8 గంటలకు జిల్లాస్థాయి జావెలిన్, 100, 400 మీటర్ల పరుగుపందెం అంశాల్లో పోటీలు తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెంటల్ స్కూల్ గ్రౌండ్ దమ్మపేటలో నిర్వహిస్తారని జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహీధర్ తెలిపారు. ఈ ఎంపికలు 14, 16, 18, 20 సంవత్సరాల లోపు బాలబాలికలు, స్త్రీపురుషులకు ఉంటాయని, ఈ ఎంపికల్లో ప్రతిభ చూపిన వారిని ఆగస్టు 7వ తేదీ సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. మరింత సమాచారం కోసం అథ్లెటిక్ కోచ్ కృష్ణకు రిపోర్టు చేయాలని, 7013552707 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

## ఆన్‌లైన్‌లో అభ్యర్థుల చెక్‌లిస్టు

కొత్తగూడెం టౌన్, జూలై 19 : జిల్లా వైద్య కళాశాలలో నోటిఫికేషన్ ఇచ్చిన 155 పోస్టుల దరఖాస్తులకు సంబంధించి అభ్యర్థుల చెక్‌లిస్టును ప్రాథమికంగా ఆన్‌లైన్ చేసి జిల్లా అధికారి వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వేల్పుల విజేత తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు లిస్టు చూసుకొని వారి అర్హత, మార్కుల విషయంలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే పదిహేను రోజుల్లోగా వచ్చేనెల 5వ తేదీలోపు తమ కార్యాలయంలో లిఖితపూర్వకంగా తగిన ఆధారాలతో అందజేయాలన్నారు.

## వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో దామోదర్‌రావు

పర్ణశాల, జూలై 19: వర్షాకాలంలో వచ్చే గోదావరి వరదల పట్ల పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో దామోదర్‌రావు అన్నారు. శుక్రవారం సున్నంబట్టి గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. గత వరదల సమయంలో జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో గ్రామంలోని ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, సీసీ రాంనాయక్ ఉన్నారు.

**లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

బూర్గంపాడు, జూలై 19: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఆర్డీవో దామోదర్ అన్నారు. వరద ప్రభావిత ప్రాంతమైన బూర్గంపాడులోని కొల్లు చెరువును, ఆంధ్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉన్న కిన్నెరసాని బ్రిడ్జిని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఏదైనా అవసరమైతే తహసీల్దార్, పోలీసుల సహాయ సహకారాలు తీసుకోవాలని అన్నారు.

## ప్రజలు బయటకు రావద్దు..ఎస్సై

జూలూరుపాడు, జూలై 19 : జిల్లాకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన క్రమంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని, భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బానోత్ రాణాప్రతాప్ పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మాట్లాడుతూ.. మరో మూడురోజులు భారీ వర్షాలు ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో ప్రజా ప్రతినిధులులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

## జలాశయాలుగా మారిన ఓసీలు..

రామవరం, జూలై 19 : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ఏరియాలోని జేవీఆర్, కిష్టారం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు 30వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. ఓసీలన్నీ జలాశయాలుగా మారిపోయాయి. 77 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లక్ష క్యూబిక్ మీటర్ల ఓబీ పనులు నిలిచిపోయాయి.

# వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల జిల్లా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్‌లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్ అధికారులు, జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇరిగేషన్ అధికారులు అన్ని ప్రాజెక్టుల వద్ద ఇసుక బస్తాలు అందుబాటులో ఉంచాలని, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని ప్రాజెక్టుల వద్ద గేట్లు తెరిచే సమయంలో ముందుగా కింద ఉన్న గ్రామాలకు తెలియజేయాలని ఆదేశించారు. నీరు కిందకి వదిలిన వెంటనే తహసీల్దార్లు, ఎంపీడీవోలు అన్ని గ్రామాలకు చాటింపు ద్వారా తెలియజేయాలని, ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రతి గ్రామంలో పునరావాస కేంద్రాలను గుర్తించాలన్నారు. అన్ని గ్రామాల్లో మరమ్మతులకు గురైన బ్రిడ్జిలు గుర్తించి వాటికి తగిన మరమ్మతులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో కరెంట్, మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టి, కావాల్సిన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట, చర్లలో బోట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు.

## ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలి

భద్రాచలం, జూలై 19: ఇందిరమ్మ ఇళ్లు ప్రతి పేద కుటుంబానికి కట్టించి ఇవ్వాలని దళిత ప్రజా సంఘం నాయకుడు అల్లాడి జయరాజు అన్నారు. శుక్రవారం స్థానిక కొర్రాజుల గుట్ట ఏరియాలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి పేదవానికి ప్రస్తుతం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం అమలులో తారతమ్మం చూపించకుండా ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు కట్టించి ఇవ్వలన్నారు. సమావేశంలో శాంతి రాజు, డేగల రాజు, బర్ల రామకృష్ణ, చీకటి దశంబాబు, హరీశ్, శ్యామ్, యేసు, కొండ, శేఖర్ పాల్గొన్నారు.

## పారిశుధ్యం, వైద్యం అత్యవసరం

అశ్వారావుపేట టౌన్, జూలై 19: వర్షాలు–వరదల నేపథ్యంలో లోతట్టు, ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, వైద్య సేవలను అత్యవసరంగా చేపట్టాలని కొత్తగూడెం డివిజినల్ పంచాయతీ అధికారి వైటీటీవీ రమణారావు అన్నారు. ఆయన శుక్రవారం అశ్వారావుపేట తదితర పంచాయతీ ల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించా రు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ.. జ్వరాలు ప్రబలకుండా వైద్యులు–సిబ్బంది సహకారంతో చర్యలు చేపట్టాలన్నారు. నిల్వ నీటి గుం త ల్లో ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. వర్షాలు త గ్గేంత వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు.

**వైద్యాధికారి పర్యటన**

చంద్రుగొండ, జూలై 19: చంద్రుగొండ పంచాయతీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కనకం తనూజ శుక్రవారం పర్యటించారు. మురుగు నీటి గుంత ల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిని పారబోయించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**వైద్య శిబిరాలు**

ఇల్లెందు రూరల్, జూలై 19: మండలంలోని విజయలక్ష్మీనగర్, సుదిమళ్ళ, రొంపేడులో శుక్రవారం వైద్య శిబిరాలను కొమరారం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ రాజు నిర్వహించారు. సిబ్బంది లాల్‌సింగ్, సంత్రాలి, ఆశా వర్కర్లు మల్లీశ్వరి, భద్రు పాల్గొన్నారు.

**అన్నపురెడ్డిపల్లిలో..**

అన్నపురెడ్డిపల్లి, జూలై 19: మండలంలోని పెంట్లం గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక నిర్వహించారు. జ్వర బాధితులను పరీక్షించి, మందులు ఇచ్చారు.

## ముగ్గురి అరెస్టు

పాల్వంచ రూరల్, జూలై 19 : అక్రమంగా గొర్రెలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులతోపాటు అవి కొన్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలోని పాండురంగాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాండురంగాపురంనకు చెందిన తెల్లావుల సంతోష్, నూకల లింగయ్య గత కొంతకాలంగా పాండురంగాపురం పరిసర ప్రాంతాల్లో గొర్రెలు దొంగిలించి వాటిని ఇతరులకు విక్రయిస్తుండేవారు. వారు దొంగిలించిన మూడు గొర్రెలను శుక్రవారం అదే గ్రామానికి చెందిన అశోక్‌కు విక్రయించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారణ జరిపి ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

## డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచ రూరల్, జూలై 19 : నిర్లక్ష్యంగా కారు నడిపి డివైడర్ ధ్వంసం చేసిన ఘటనలో పాల్వంచ రూరల్ పోలీసులు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలికి చెందిన కారు గురువారం భద్రాచలం వెళ్తున్నది. డ్రైవర్ నిరక్ష్యంగా కారు నడుపుతూ కేశవాపురం వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. బలంగా ఢీకొట్టడంతో కారులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. డివైడర్ పూర్తిగా ధ్వంసమైంది. పంచాయతీరాజ్ ఏఈ అనిల్‌కుమార్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసులు డ్రైవర్ గోపీకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

దమ్మపేట, జూలై 19: మండలంలోని శ్రీరామపురం గ్రామ సమీపంలో శుక్రవారం కొన్ని పాడి గేదెలు మేతకు వెళ్లాయి. అక్కడ ఉన్న విద్యుత్ స్తంభానికి తగలడంతోనే విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతిచెందాయి. వీటి విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని బాధిత రైతు మట్టా మంగమ్మ తెలిపింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నది.

## 'శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండొద్దు..'

కొత్తగూడెం అర్బన్, జూలై 19 : ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలను పరిశీలించారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియదు కాబట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రజలకు సూచించారు.

## 22న మండల సమావేశం

లక్ష్మీదేవిపల్లి, జూలై 19 : ఈ నెల 22వ తేదీన లక్ష్మీదేవిపల్లి మండల ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## గనుల్లో భద్రత పెంపునకు పటిష్ట చర్యలు

### సీఎండీ బలరాంనాయక్



మాట్లాడుతున్న సీఎండీ బలరాంనాయక్

కొత్తగూడెం సింగరేణి, జూలై 19 : సింగరేణి బొగ్గు గనుల్లో భద్రత పెంపునకు పటిష్ట చర్యలు తీసుకుంటామని సీఎండీ బలరాంనాయక్ తెలిపారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం జరిగిన 48వ రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శప్రాయంగా ఉందని, రక్షణలో కూడా ప్రమాదరహిత కంపెనీగా రూపుదిద్దాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ రీజియన్2 నాగేశ్వరరావు, ఇతర డీజీఎంఎస్ అధికారులు సింగరేణి వ్యాప్తంగా రక్షణ పెంపుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. డైరెక్టర్లు డీ సత్యనారాయణ, ఎన్‌వీకే శ్రీనివాసవ, జి.వెంకటేశ్వర్‌రెడ్డి రక్షణ చర్యలపై ప్రసంగించారు. కార్యక్రమంలో జీఎం కో ఆర్డినేషన్ దేవేందర్, జీఎం సీపీపీ జక్కం రమేష్, జీఎం పీపీ సాయిబాబా, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలు, అన్ని ఏరియాల నుంచి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు, డీజీఎంఎస్ అధికారులు పాల్గొన్నారు.

## క్రీడాకారుడికి రూ.లక్ష చెక్కు అందజేత



క్రీడాకారుడు వంశీకి రూ.లక్ష అందజేస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జూలై 19: భద్రాచలం పట్టణానికి చెందిన గిరిజన క్రీడాకారుడు మోడెం వంశీ యూరప్‌లోని మాల్టాలో జరిగే పోటీలకు భారత దేశం తరపున జూనియర్ విభాగంలో నిర్వహించే పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అంతదూరం ఎలా వెళ్లాలో, ఎవరిని సాయం అడగాలో తెలియక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో బీ రాహుల్ వంశీని పిలిపించి రూ.1 చెక్కును అందజేసి, బంగారు పతకం సాధించి, ఇండియాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిమ్ నిర్వాహకులు గొంగిడి రామిరెడ్డి, ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రామవరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ, జూలై 19 : మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన కరకవాగు రోడ్డు ప్రారంభోత్సవంతోపాటు రూ.27 లక్షలతో అభ్యుదయ స్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీటితోపాటు మున్సిపల్ సమావేశ మందిరంలో మొత్తం 86 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కొత్వాల శ్రీనివాసరావు, సాబీర్‌పాషా, కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీఓ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**విద్య, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టి**

రామవరం, జూలై 19 : విద్య, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. రామవరం 11వ వార్డు పరిధిలోని నేతాజీ ఉన్నత పాఠశాలలో రూ.13.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీనివాస్, సాబీర్‌పాషా, సీతాలక్ష్మి, జుంకీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు అన్నదానం

అశ్వారావుపేట రూరల్, జూలై 19: మండలంలోని గుమ్మడవల్లి గ్రామంలో వరద బాధితులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. పెదవాగు ప్రాజెక్టుకు గండ్లు పడడంతో గుమ్మడవల్లి గ్రామంలోని 50ఇండ్లలోకి వరద నీరు వచ్చింది. బాధితులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారికి శుక్రవారం రామాలయం వద్ద భోజనాలను ఎమ్మెల్యే ఏర్పాటు చేశారు. గుమ్మడివల్లి గ్రామానికి పక్కనే కమ్మరిగూడెం గ్రామం ఉంది. ఇది, ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో ఉంది. ఇక్కడ దా దాపు 60ఇళ్లు నీట మునిగాయి. 200మంది నిరాశ్రయులయ్యారు. వీరికి ఆసుపాక గ్రామానికి చెందిన జారే, జూపల్లి యూత్ బాధ్యులు భోజనాల ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, ప్రమోద్, చెన్నకేశవరావు, తుమ్మ రాంబాబు, ముబారక్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేశ్



రమేశ్‌ను సన్మానిస్తున్న కార్మిక నేతలు

పాల్వంచ, జూలై 19 : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చారుగుండ్ల రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కేటీపీఎస్‌లోని టీఆర్‌వీకేఎస్ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సన్మాన సభలో ఆయన పాల్గొని అంబేద్కర్, తెలంగాణతల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన్ని గజమాలతో సన్మానించారు. తోట కోటేశ్వరరావు, రాంబాబు, శ్రీను, సాధిక్‌పాషా, కే.రవికుమార్, సంతోష్‌రెడ్డి, వీరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - డీఎస్పీ

మణుగూరు టౌన్, జూలై 19: రాగల రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరిలోకి వెళ్లకూడదన్నారు. రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో పశువుల కాపరులు, వాగుల పక్కన పొలాలు ఉండే రైతులు సైతం గోదావరిలోకి వెళ్లొద్దని సూచించారు. ప్రజలు ఏదైనా సమస్య ఉంటే 100కు డయల్ చేసి పోలీసులను సంప్రదించాలన్నారు.

## కిన్నెరసాని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచ రూరల్, జూలై 19: కిన్నెరసాని వాగు పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ నవీన్ ప్రజలను కోరారు. కిన్నెరసాని దిగువప్రాంతంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను పోలీసు, పంచాయతీ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. రాత్రి వేళలో డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**బూర్గంపహాడ్..**

బూర్గంపాడు, జూలై 19: కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ కోరారు. బూర్గంపాడులోని లోతట్టు ప్రాంతాల్లో శుక్రవారం ఎస్సై రాజేశ్‌తో కలిసి పర్యటించారు. అంబేద్కర్ కాలనీలోని ప్రజలతో మాట్లాడి ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరిగినా, ప్రమాదాన్ని గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

OLD AGE HOME

★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325766-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616